ఈ-పేపర్ తెలుగు డైలీ | 8PM

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

సోమవారం 10, జూలై 2023

జైస్వాల్ గార్డెన్ పురవీధుల్లో అమ్మోరి ఘటం

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 10: ఈ నెల 16న ఆషాడ బోనాల పండుగ సందర్భంగా అంబర్ పేట మహంకాళీ అమ్మవారి ఘటం ఇయ్యాల సోమవారం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్ పురవీధుల్లో ఊరేగింది. ఈ సందర్భంగా జైస్వాల్ గార్డెన్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్ అమ్మవారి ఘటానికి వడి బియ్యం సమర్పించి పూజలు చేశారు. అమ్మోరి ఘటాన్ని ఊరేగిస్తున్న మోర నరసింహారావు ముదిరాజ్ ను శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో పుష్పలత, సాయి, ఆదిత్య, తలారి యాదయ్య, స్వామి తదితరులు ఉన్నారు.



మహంకాళీ అమ్మ వారి ఘటానికి పూజలు చేస్తున్న చింత శ్రీనివాస్ ముదిరాజ్

డేంజరెస్ లెవల్‌కు యమునా రివర్.. సీఎం కేజ్రీవాల్ ఎమర్జెన్సీ మీటింగ్

2

ఆ బిల్లులపై ఎందుకంటే... రాజ్ భవన్ క్లారిటీ

2

అవసరమైతే సీతక్కను సీఎం చేస్తాం - రేవంత్ రెడ్డి

2

బోనాల పండుగను ధూంధాంగా జరుపుకోవాలి

బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 10: ఈ నెల 16న ఆదివారం నియోజరవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న బోనాల జాతరను ప్రజలు భక్తి శ్రద్ధలతో ధూంధాగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. ఇయ్యాల సోమవారం కాచిగూడ తుల్జాభవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోల్నాక, అంబర్ పేట, బాగ్ అంబర్ పేట, నల్లకుంట , కాచిగూడ డివిజన్ల కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ , ఇ. విజయ్ కుమార్ గౌడ్, బి.పద్మా వెంకటరెడ్డి, వై.అమృత, ఉమా రమేష్ యాదవ్ తదితరులతో కలసి నియోజకవర్గ వ్యాప్తంగా 89 అమ్మార్ల దేవాలయాలకు బోనాల పండుగ ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం నుండి మంజూరైన సుమారు రూ. 34 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయా ఆలయాల కమిటీల ప్రతినిధులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం బోనాల పండుగకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగా బోనాల పండుగ ఉత్సవాల కోసం ప్రతీ ఆలయంలో ఘనంగా ఏర్పాట్లకు అండగా నిలుస్తోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి అధికారికంగా నిర్వహిస్తూ వస్తుందన్నారు. అంతేకాకుండా ఉత్సవాల నిర్వహణ కోసం దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు మాత్రమే కాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రైవేట్ దేవాలయాలకు కూడా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.

నియోజక వర్గ ప్రజలంత భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకోవాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆలయాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లతో కలసి బోనాల చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

లష్కర్ బోనాల్లో రంగమెక్కిన స్వర్ణలత

అగ్నిప్రమాదాలు జరుగుతాయి.. ఆలస్యమైనా వర్షాలు వస్తాయి.. నేనున్నా.. భయం వద్దు'

ఇయ్యాల్టి న్యూస్, సికింద్రాబాద్ , జూలై 10: సికింద్రాబాద్ లష్కర్ బోనాల జాతర కన్నుల పండువగా సాగింది. తొలి రోజు అమ్మవారిని వేలాదిగా దర్శించుకున్న భక్తులు.... రెండో రోజు వేడుకల్లో ప్రధాన కార్యక్రమమైన రంగం కార్యక్రమం ఇవాళ అట్టహాసంగా సాగింది. అమ్మవారు చెప్పే భవిష్యవాణిని ఆసక్తిగా విన్నారు. ఉదయం అమ్మవారి అలయం నుంచి పసుపు, కుంకుమలు, వస్త్రాలతో మాతంగి స్వర్ణలత నివాసానికి వెళ్లిన ఆలయ సిబ్బంది, పూజారులు... ఆమెకు పసుపు రాసి దప్పు చప్పుళ్ళ మధ్య ఆలయానికి తీసుకువచ్చారు.

రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత అమ్మవారి పేరిట భవిష్యవాణి పలికింది. ప్రజల పూజలు సంతోషంగా అందుకున్నానని చెప్పారు. గతేడాది మీరు ఇచ్చిన వాగ్దానం మరిచిపోయారన్నారు. కావాల్సిన బలాన్నిచ్చానని.. భక్తుల వెంటే ఉంటానని చెప్పారు. ఆలస్యమైనా వర్షాలు తప్పకుండా వస్తాయని భవిష్యవాణి పలికారు.

కాగా..భవిష్యవాణి అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. రంగం కార్యక్రమంతో భవిష్యవాణి పూర్తయిందన్నారు. మరికాసేపట్లో పోతరాజుల ఊరేగింపు, ఘటోత్సవం ఘనంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారని తెలిపారు. రాత్రంతా దర్శనాలు జరిగాయన్న తలసాని... సీఎం, మంత్రులు, వివిధ పార్టీల పెద్దలు మహంకాళి అమ్మవారిని దర్శనం చేసుకున్నారన్నారు.

ఓపనింగ్‌కు అంజయ్య పార్కు రెడీ : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 10: అన్ని హంగులతో కొత్త రూపు సంతరించుకొని అంజయ్య పార్కు ఓపనింగ్ కు రెడీగా ఉందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చెప్పారు. ఇయ్యాల సోమవారంహెచ్ఎండీఏ అధికారులతో కలిసి నల్లకుంట డివిజన్ లోని ఏఎన్ఆర్, మోతే నాగేశ్వరరావు, కాచిగుడ డివిజన్ లోని అంజయ్య పార్కులను ఆయన సందర్శించారు. అక్కడి పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అంజయ్య పార్కు పనులు దాదాపుగా పూర్తి అయ్యాయని , త్వరలోనే పార్కును ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. అలాగే ఎంఎన్ఆర్ పార్కు , మోతే నాగేశ్వరరావు పార్కుల్లో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ ఈఈ శంకరయ్య, డీఈ సౌమ్య, ఏఈ ఆదమ్, రాణి రుద్రమ, మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నల్లకుంట అంజయ్య పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల గెస్ట్ లెక్చరర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి: ఆర్.కృష్ణయ్య

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 10: ప్రభుత్వ డిగ్రీ కాలేజుల్లో పనిచేసే 1940 మంది గెస్ట్ లెక్చరర్లను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.. ఇయ్యాల సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా రాజ్య సభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య హాజరయ్యారు. నిరుద్యోగుల జేఏసి చైర్మన్ నీల వెంకటేశ్ , జాతీయ బీసీ సంక్షేమ సంఘ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆర్.

కాచిగూడలో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కృష్ణయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం లోని 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాదాపు 30 లక్షల మంది నిరుపేద బడుగు బలహీన వర్గాల పిల్లలు విద్య నభ్యసిస్తున్నారని తెలిపారు. కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కంటే ముందునుంచే తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసున్న అతిథి అధ్యాపకులు చాలిచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 132 కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న ఈ 1940 మందిని రెన్యువల్ చేస్తూ వారికి కాన్సాలిడేట్ జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు....



మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దేవస్థాన సేవాసమితి ప్రతినిధులు

కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్‌ను ఆహ్వానిస్తున్న దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు

మహంకాళీ బోనాల పండుగకు రావాలని...

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 10: ఈ నెల 16న అంబర్ పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబర్ పేట మహంకాళి అమ్మ వారి బోనాలకు రావాలని ఇయ్యాల మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ ను అంబర్ పేట దేవస్థాన సేవా కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు.

గోల్నాకలో మహాజన్ సంపర్క్ అభియాన్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 10: బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం ఇయ్యాల గోల్నాక డివిజన్‌లోని నెహ్రూనగర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా ఇంచార్జ్ బి. వెంకట రెడ్డి శక్తి కేంద్రం లో ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ 9 ఏండ్ల పాలనను, విజయాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గోల్నాక డివిజన్ కన్వీనర్ మూల రవీందర్ గౌడ్ , కేసరి నర్సింగరావు యాదవ్ , కృష్ణంరాజు , ఆర్బిఎల్ రమేశ్ , బి. రంజిత్ రెడ్, డి. శివరాజ్ , హనుమంత రాజు, ఆనంద్, గాంధీ, సంతోష్ వర్మ ,నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్ బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో బీజేపీ నేత బి.వెంకట్ రెడ్డి

క్రీడా అకాడమీలకు కేసీఆర్ ప్రభుత్వ ప్రోత్సాహం

డాక్టర్ ఆంజనేయ గౌడ్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 10: తెలంగాణ క్రీడా సాధికార సంస్థ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న క్రీడా అకాడమీలకు కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం కల్పిస్తున్నదని

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. ఇయ్యాల ఎల్‌బి స్టేడియంలోని కార్యాలయంలో రాష్ట్రంలో ఉన్న క్రీడా అకాడమీలు, స్పోర్ట్స్ స్కూల్‌లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత దశాబ్ది కాలం నుంచి క్రీడా అకాడమీలు స్పోర్ట్స్ స్కూల్‌లపై స్పోర్ట్స్ అథారిటీ ప్రత్యేక శ్రద్ధతో అనేక చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆరు నూతన స్పోర్ట్స్ అకాడమీలను సీఎం కేసీఆర్ గారు ప్రారంభించారన్నారు. క్రీడా పాఠశాలలు మరియు అకాడమీల నిర్వహనపై రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను ప్రతి ఏటా ఖర్చు చేస్తోందన్నారు.

స్పోర్ట్స్ స్కూల్లు, అకాడమీలు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించే దిశగా దృష్టి సారించాలని అకాడమీల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండే విధంగా ప్రతి మూడు నెలలకు ఓసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఒఎస్‌డి డాక్టర్ కె. లక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్ జి. చంద్రారెడ్డి, ఎఎస్‌డి డాక్టర్ కె. నర్సయ్య, డీవైఎస్ఓ జి. అశోక్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎ. అశోక్ కుమార్, డివైఎస్ఓలు పరందమ్ రెడ్డి, సుధాకర్ రావు, వెంకటేశ్వర్ రావు, అథ్లెటిక్ కోచ్ ఎం.డి. గౌస్, బి.ఇ. షాలిని ప్రియ, అకాడమీ ఇన్చార్జులు ఉన్నారు.

అవసరమైతే సీతక్కను సీఎం చేస్తాం : రేవంత్ రెడ్డి

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 10: ఎలక్షన్స్ ముందు సీఎం అభ్యర్థులను ప్రకటించే సంప్రదాయం కాంగ్రెస్ లో లేదన్నారు టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి. అవసరమైతే సీతక్కను పార్టీ సీఎం చేస్తుందని చెప్పారు. పోలవరం, అమరావతిలను నిర్మించేది కాంగ్రెస్సే అని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అమెరికాలోని తానా సభల్లో ఎన్నారైలు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు రేవంత్. దళితులు, ఆదివాసీలను సీఎం కానివ్వరా అని.. అధికారంలోకి వస్తే సీతక్కకు ఉపముఖ్యమంత్రి పదవైనా ఇవ్వాలని ఎన్నారైలు కోరారు. దీనిపై రేవంత్ స్పందిస్తూ అవసరమైనతే పార్టీ సీతక్కను సీఎం చేస్తుందన్నారు.

తెలంగాణలో భారీ వర్షాలు..

19 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 10: తెలంగాణలో వానలు పడుతున్నాయి. పశ్చిమ భారత ప్రాంతాల నుంచి తెలంగాణలోకి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయి. ఈ ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నెల 13 వరకు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయంటున్నారు.. జులై 12, 13న పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అంతేకాదు ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టాయి.. తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తున్నాయి. అంతేకాదు హైదరాబాద్‌లో వాతావరణం చల్లబడింది..

బీజేపీ ఇచ్చింది లేదు.. కాంగ్రెస్ చేసింది లేదు..

- మంత్రి హరీశ్‌రావు

ఇయ్యాల్టి న్యూస్, సంగారెడ్డి, జూలై 10: తెలంగాణకు భారతీయ జనతా పార్టీ ఇచ్చింది లేదు.. కాంగ్రెస్ పార్టీ చేసింది లేదు అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పటాన్‌చెరులో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్, ఫ్రీడం పార్కులను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్స్ వంటి పథకాలు ఉన్నాయా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రిజెక్టెడ్ లీడర్లు, స్క్రాప్ లీడర్లు జాయిన్ అయితే పోయేది లేదు. బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని ట్రిక్కులు చేసినా, హ్యాట్రిక్ కొట్టేది బీఆర్ఎస్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ప్రతిపక్షాలు అధ్యక్షులను మార్చినా, ఔట్ డేటెడ్ లీడర్లకు పట్టం కట్టినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం తథ్యమన్నారు.

నానమ్మకు అంకితం..

రూ.రెండున్నర కోట్ల సొంత ఖర్చుతో కేటీఆర్ స్కూల్..

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 10: మంత్రి కేటీఆర్ చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు అందరిని ఆకర్షిస్తుంది తన నాన్నమ్మ సోంత ఊరు పై ప్రేమను చాటుకోవడం ఇప్పుడు కామారెడ్డి జిల్లా కోనపూర్‌లో పండగ వాతవరణాన్ని సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. మంత్రి కేటిఆర్ నాన్నమ్మ వెంకటమ్మ సోంతూరు బీబీపేట మండలం కోనపూర్. కాగా గత ఏడాది మే 10 వ తేదీన కామారెడ్డి జిల్లా కోనపూర్‌లో పర్యటించారు మంత్రి. ఆ సమయంలోనే తన సోంత డబ్బులతో పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి రెగ్యూలర్‌గా మానిటర్ చేస్తూనే ఉన్నారు. రూ. రెండున్నర కోట్లతో

ఆధునిక హంగుల ఈ పాఠశాల భవనం నిర్మించారు. దీంతో పాటుగా గ్రామంలో రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులను సైతం ప్రారంభించారు. గ్రామానికి వెళ్లే దారిలో రూ.2.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు..75 లక్షలతో సీసీ రోడ్లు వేశారు. అలాగే 25 లక్షలతో గ్రామ పంచాయితీ నిర్మాణం చేపట్టారు. మరో 5 కోట్లను ప్రత్యేక నిధి కింద గ్రామానికి మంజూరు చేశారు.. వీటితో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించారు. ఇళ్ల వరకూ రోడ్లు వేశారు. గ్రామంలో కుల సంఘాల భవనాలు, పలు ఆలయాల నిర్మాణాలు కూడా చేపట్టారు.పాఠశాల భవనానికి సంబంధించి ట్వీట్ చేసిన కేటీఆర్.. నిర్మాణం పూర్తయిన బిల్డింగ్ ఫొటో, వీడియోను కేటీఆర్ ట్వీట్టర్‌లో పోస్ట్ చేశారు. త్వరలోనే కోనపూర్‌కు వచ్చి నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ భవనాల ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్.. తన తల్లి శోభతో కలిసి విచ్చేయనున్నట్లు తెలుస్తోంది.

ఈటలకు 'వై ప్లస్',... అర్వింద్‌కు 'వై' కేటగిరీ భద్రత..

కేంద్రం కీలక నిర్ణయం...!

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 10: తెలంగాణలో ఇద్దరు బీజేపీ నేతలకు కేంద్రం భద్రతను పెంచింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌లకు ఇకపై కేంద్ర బలగాలు భద్రత కల్పించనున్నాయి. ఈటల రాజేందర్‌కు 'వై ప్లస్', అర్వింద్‌కు 'వై' కేటగిరీ భద్రతను కేంద్రం కేటాయించింది.వీరిద్దరికీ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలతో భద్రత కల్పించింది. ఈటలకు 11 మందితో కూడిన సీఆర్పీఎఫ్ సిబ్బంది సెక్యూరిటీ కల్పించనున్నారు. ఇక అర్వింద్‌కు 8 మందితో కూడిన సీఆర్పీఎఫ్ బలగాలు రక్షణ కల్పించనున్నాయి. కాగా ఇప్పటికే ఈటల రాజేందర్‌కు తెలంగాణ సర్కార్ 'వై ప్లస్' భద్రత కల్పించిన విషయం తెలిసిందే. ఈటల ప్రాణాలకు ముప్పు ఉందని, ఆయన హత్యకు ప్లాన్ జరుగుతోందన్న ప్రచారంతో బుల్లెట్ ప్రూఫ్ వెహికల్ సహా 16 మందితో సెక్యూరిటీని ఏర్పాటు చేసింది.

డేంజరెస్ లెవల్‌కు యమనా రివర్.. సీఎం కేజ్రీవాల్ ఎమర్జెన్సీ మీటింగ్

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 10: ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో యమనా రివర్ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే ఆ నది నీటిమట్టం వార్నింగ్ మార్క్‌ను దాటి.. ప్రమాద స్థాయికి చేరింది. దీంతో వరద ముప్పు పొంచి ఉందని అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇది ఒకరినొకరు నిందించుకునే సమయం కాదని.. ప్రజలకు సహాయం చేసేందుకు అందరం కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. యమునా నదిలో నీటిమట్టం అంతకంతకూ పెరగడంతో కేంద్ర జల కమిషన్‌ను సైతం సంప్రదించామని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతానికి ఢిల్లీలో వరదలు వచ్చే పరిస్థితులు లేవని నిపుణులు అంచనా వేస్తున్నారని తెలిపారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు రోడ్లపై గంతలు ఎప్పటికప్పుడు పూడుస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఇటీవల ఢిల్లీలో రోడ్లు కుంగిన ఘటనలపై కూడా విచారణకు ఆదేశించారు. ఇదిలా ఉండగా ఇయ్యాల మధ్యాహ్నం 1 గంట సమయానికి ఢిల్లీలోని పాత రైల్వే వంతెన వద్ద యమునా నది నీటిమట్టం 204.63 మీటర్లకు చేరింది. అయితే మంగళవారం నాటికి ఈ నీటిమట్టం 205.5 మీటర్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అధికారులు సహాయక చర్యల కోసం 16 కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. అలాగే క్విక్ రెస్పాన్స్ టీమ్, బోట్లను కూడా అందుబాటులో ఉంచారు.

తెలంగాణలో ఎల్లుండి విద్యా సంస్థలు బంద్.. ఎందుకంటే..?.

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 10: ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల వసూలుకు వ్యతిరేకంగా అఖిల భారత విద్యార్థి సంఘం (ఏబీవీపీ) పలు నిరసన కార్యక్రమాలను చేపడుతోన్న విషయం తెలిసిందే. ఫీజుల పెంపునకు నిరసనగా పాఠశాలల బంద్‌కు పిలునిస్తున్నారు.

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో జూలై 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ విద్యా సంస్థలను మూసివేయించాయి. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణలో విద్యా రంగంలో జరుగుతోన్న అక్రమ ఫీజు దోపిడీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని వామపక్ష విద్యార్థి సంఘం (ఏఐఎస్ఎఫ్) నిర్ణయించుకుంది.

ఇందులో భాగంగానే జులై 12వ తేదీన విద్యా సంస్థలు బంద్ చేయాలంటూ పిలుపునిచ్చింది. తాజాగా ఏఐఎస్ఎఫ్ నాయకులు హైదరాబాద్‌లోని కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పలు రకాల అంశాలపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగ సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదంటూ నాయకులు విమర్శించారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో సరైన కేటాయింపులు చేయడం లేదంటూ, విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందంటూ ఆరోపించారు.ఈ నేపథ్యంలోనే విద్యా రంగంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిలంచాలని, స్కూల్ ఫీజులను తగ్గించాలనే డిమాండ్‌తో జులై 12వ తేదీ (బుధవారం) రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలన్నీ బంద్ చేయాలంటూ పిలుపునిచ్చింది.

ఆ బిల్లులపై ఎందుకంటే... రాజ్ భవన్ క్లారిటీ

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 10: రాష్ట్రంలో గత కొంతకాలంగా ప్రగతి భవన్, రాజ్‌భవన్ మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా పెండింగ్ బిల్లుల అంశపై సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళిసై మధ్య విభేదాలు ఏర్పడిన సంగతి తెలిసిందే. పెండింగ్ బిల్లులను గవర్నర్ ఆమోదించడం లేదని బీఆర్ఎస్ సర్కార్ ఆమెపై విమర్శలు చేసింది. అలాగే ఇందుకు సంబంధించిన అంశంపై సుప్రీం కోర్టులో కూడా వాడీవేడిగా వాదనలు జరిగాయి. ఇప్పటికీ ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకునేందుకే గవర్నర్ బిల్లులను పెండింగ్‌లో పెడుతున్నారంటూ అధికార పార్టీ నేతలు ఆమెపై విరుచుకుపడుతున్నారు. అయితే తాజాగా పెండింగ్ బిల్లుల అంశానికి సంబంధించి రాజ్‌భవన్ వివరణ ఇచ్చింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వద్ద ఎటువంటి బిల్లులు ప్రస్తుతం పెండింగ్‌లో లేవని తెలిపింది. గతంలోనే ఈ 3 బిల్లులను గవర్నర్ ఆమోదించారని స్పష్టం చేసింది. అలాగే మరో రెండు బిల్లులను రాష్ట్రపతి పరిశీలను పంపారని తెలిపింది. మిగిలి ఉన్న బిల్లులపై కూడా వివరణ కోరుతూ రాష్ట్ర సర్కార్‌కు తిరిగి పంపామని వివరించింది.

వందే భారత్ రైళ్ల కలర్ మారింది..?

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 10: వందే భారత్ రైళ్లు సరికొత్త రంగుతో ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఇప్పటి వరకు నీలం, తెలుపు రంగుల్లో భారత్ లోని పలు రాష్ట్రాల్లో దూసుకుపోతున్న వందే భారత్ రైళ్లు రంగులు మార్చుకున్నాయి. సరికొత్త రంగుతు ఎంట్రీ ఇవ్వటానికి రెడీ అయ్యాయి. కొత్త రంగులోకి మారిన వందే భారత్ న్యూ రైళ్ల ఫోటోలను రైల్వే రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. కొత్త రంగులో.. సరికొత్త మార్పులతో పట్టాలపై పరుగులు పెట్టనున్నాయి.ఇప్పటి వరరు నీలం, తెలుపు రంగుల్లో ఉన్న వందే భారత్ రైళ్లు ఇక నుంచి ఆరెంజ్, గ్రే కలర్ కాంబినేషన్‌లో మారిపోనున్నాయి. వందే భారత్ రైలులో 25 కొత్త మార్పులు చేశామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ మార్పులు ప్రయాణీకుల అభిప్రాయాల మేరకే చేశామని స్పష్టంచేశారు. సీటు వాలే కోణాన్ని కూడా మార్చామని., సీట్లకు మెరుగైన కుషన్, మొబైల్ చార్జింగ్ పాయింట్లకు గతం కంటే మెరుగైన సౌకర్యం, ఎగ్జిక్యూటివ్ చైర్ ఫుట్ రెస్ట్, వాష్ బేసిన్ల లోతు, టాయిలెట్ లో వెలుతురు వంటి పలు విషయాల్లో మార్పు చేశామని తెలిపారు. వీటితో పాటు కొత్త సెక్యూరిటీ ఫీచర్ యాంటీ-క్లైంబర్స్ పై కూడా పని జరుగుతోందని తెలిపారు. కొత్తగా మారిన ఈ రంగులను మన దేశ త్రివర్ణ పతాకం నుంచి కొత్త రంగును తీసుకున్నామని వెల్లడించారు.

చంద్రయాన్ -3 ప్రయోగం లైవ్‌లో చూడాలనుకుంటున్నారా?

ఇయ్యాల్టి న్యూస్, శ్రీహరికోట, జూలై 10: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చంద్రయాన్ -3 ఈనెల 14న మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగానికి సిద్ధమైంది. ఈ మేరకు ఇస్రో అన్ని ఏర్పాట్లు చేసింది. మిషన్‌లో భాగంగా ఎల్‌వీఎం-3పీ4 రాకెట్‌తో చంద్రయాన్ -3 అంతరిక్ష నౌకను అనుసంధానించే ప్రక్రియను ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటికే పూర్తి చేశారు. ఈ ఉపగ్రహం సుమారు 3,84,000 కిలో మీటర్లు ప్రయాణించి చంద్రుని నుంచి వంద కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి చేరుకుంటుంది. ఆ తరువాత జాబిల్లి దక్షిణ ధ్రువంలోని నిర్దేశిత ప్రదేశంలో ల్యాండ్

అవుతుంది. అంతా సవ్యంగా జరిగితే ఆగస్టు 23న చంద్రుడిపై ల్యాండ్ అవుతుందని ఇస్రో తెలిపింది. అయితే, ఇస్రో ప్రతిష్టాత్మకంగా ప్రయోగిస్తున్న చంద్రయాన్ - 3ని ప్రత్యక్షంగా చూడాలనుకుంటున్నారా? ఈ ప్రయోగాన్ని లైవ్‌లో వీక్షించేందుకు ఇస్రో అవకాశం కల్పిస్తుంది. ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలనుకునే వారు ఆన్‌లైన్‌లో Lvg.shar.gov.in అనే లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని ఇస్రో ట్వీట్ చేసింది. ఇలా నమోదు చేసుకున్నవారు శ్రీహరికోటలోని లాంచ్ వ్యూ గాలరీ నుంచి ప్రయోగాన్ని నేరుగా వీక్షించొచ్చు. ఇందుకోసం ఇస్రో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. లాంచ్ వ్యూ గ్యాలరీలో 5వేల మంది సీటింగ్ కెపాసిటీ ఉంది. సందర్శకులకోసం పెద్దస్క్రీన్లు ఏర్పాటు చేసింది. అయితే, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జూలై 14 మధ్యాహ్నం 2.35 గంటలకు ఈ ప్రయోగం మొదలవుతుందని ఇస్రో డైరెక్టర్ ఎస్. సోమనాథ్ ఇప్పటికే ప్రకటించారు.

ట్రాన్స్‌జెండర్ మోడల్...
మిస్ నెదర్లాండ్స్ టైటిల్

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 10: మిస్ నెదర్లాండ్స్ టైటిల్‌ను తొలిసారి ఓ ట్రాన్స్‌జెండర్ మహిళ గెలుచుకున్నది. రిక్కీ వలేరి కొల్లే ఆ ఘనతను తన ఖాతాలో వేసుకున్నది. అందగత్తెల పోటీల్లో ట్రాన్స్‌జెండర్ మహిళ ఆ టైటిల్‌ను దక్కించుకోవడం చరిత్రలో ఇదే మొదటిసారి. 22 ఏళ్ల రిక్కీ పోటీల్లో మేటి మోడల్స్‌ను ఓడించింది. ఆమస్టర్‌డామ్‌లో జరిగిన కార్యక్రమంలో మోడల్ రిక్కీ విజేతగా నిలిచింది. దీంతో ఎల్ సాల్వడార్‌లో జరగనున్న 72వ మిస్ యూనివర్స్ పోటీలకు ఆమె ఎంపికైంది.అందగత్తె టైటిల్ గెలిచిన తర్వాత ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో సంతోషాన్ని వ్యక్తం చేసింది. గర్వంగా, ఆనందంగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నది. ఆ సంతోషాన్ని వర్ణించలేనని చెప్పింది. తన ఇన్‌స్టాలో ఈవెంట్‌కు చెందిన ఫోటోలు, వీడియోలను అప్‌లోడ్ చేసిందామె. డచ్, మొలుకన్ సంతతి ఆనవాళ్లు ఉన్న ఆ సుందరిది బ్రెడా సిటీ. రిక్కీ బయోలాజికల్ మేల్‌గా పుట్టింది. అయితే మహిళలకు రోల్ మాడల్ కావాలనుకుంటున్నట్లు ఆమె వెల్లడించింది. వివక్షకు వ్యతిరేకంగా పోరాడనున్నట్లు తెలిపింది.

ఉత్తరాదిని ముంచెత్తిన వానలు...

యూపీలో 34 మంది మృతి..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 10: భారీ వర్షాలతో ఉత్తర భారత్ గజగజ వణుకుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ-కశ్మీర్ వంటి రాష్ట్రాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. యమున సహా పలు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇప్పటి వరకూ 34 మంది వరకు చనిపోయారు. గత 24 గంటల్లో 10 మంది కన్నుమూశారు. యోగి ఆదిత్యనాథ్ సర్కార్ లెక్కల ప్రకారం.. చనిపోయిన 34 మందిలో 17మంది పిడుగుపాటుతో చనిపోగా... 12 మంది మాత్రం వరదల్లో మునిగిపోవడం వల్ల మృత్యువాత పడ్డారు. భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించాయి. కొండచరియలు విరిగిపడటంతో ఐదుగురు మరణించారు. ఈ వర్షాకాలంలో ఉత్తరప్రదేశ్‌లో ఇప్పటికే 11 శాతం అధిక వర్షపాతం నమోదైంది. దీనివల్ల నది నీటి మట్టాలు పెరిగి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. భారత మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని 75 జిల్లాల్లో దాదాపు 68 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది.

అమృత్‌సర్ సరిహద్దుల్లో....
పాక్ డ్రోన్ పట్టివేత

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 10: భారత సరిహద్దుల్లో పాక్ డ్రోన్ ను బీఎస్ఎఫ్ జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. బీఎస్ఎఫ్, పంజాబ్ పోలీసులు అమృత్‌సర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో మరో పాక్ డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెర్చ్ ఆపరేషన్ తర్వాత అమృత్‌సర్‌లోని కక్కర్ గ్రామ శివార్లలో డ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. భారత గగనతలంలోకి ప్రవేశించిన పాకిస్థాన్ డ్రోన్‌పై అజ్నాలా సబ్ డివిజన్‌లోని కక్కర్ గ్రామ సమీపంలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఆదివారం కాల్పులు జరిపింది. నిర్దిష్ట సమాచారంతో గాలించగా పాక్ డ్రోన్ కనిపించిందని బీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి చెప్పారు.

ఈ లేడీ.. మహా కిలాడీ..!

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 13మంది..!

ఇయ్యాల్టి న్యూస్, వరంగల్, జూలై 10: విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి నిత్య పెళ్లి కూతురి అవతారమెత్తింది ఓ యువతీ. అవసరాల కోసం యువకులతో ప్రేమాయణం.. ఏకంగా పెళ్లి చేసుకుని అందినంత దండుకుంటుంది. పనైపోయిందని తెలిసి.. మరొకరిని చూసుకుంటుంది. ఆమెకు ఇది నిత్య కృత్యంగా మారింది. సదరు యువతీ వేధింపులను భరించలేక నాలుగోవ భర్త పోలీసులను ఆశ్రయించడంతో నిత్య పెళ్లి కూతురి భాగోతం వెలుగులోకి వచ్చింది.పెద్దపల్లి జిల్లా ఎన్ టీ సీపీ ప్రాంతానికి చెందిన సుద్దాల రేవంత్‌కు వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన ఓ యువతితో సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని యువతి తనకు అనుకూలంగా మలుచుకుని, 2022 డిసెంబర్‌లో వివాహం చేసుకుంది. మూడు నెలలు అనుమానం రాకుండా వ్యవహరించిన యువతి.. గత మార్చి నెల నుండి రేవంత్‌కు దూరంగా ఉంటుంది. భార్యను వెంట తెచ్చుకునేందుకు ప్రయత్నించిన రేవంత్ పై యువతీ.. తన అనుచరులతో దాడి కూడా చేయించింది. ఆ తర్వాత తనకు 20 లక్షల రూపాయల డబ్బులు ఇవ్వాలని లేదంటే రేవంత్ పర్సనల్ వీడియోలు వైరల్ చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడింది.

సంస్కృతిని కాపాడుకుంటేనే
స్థిరమైన భవిష్యత్..

జీ 20 సమ్మిట్‌లో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 10: కర్ణాటకలోని హంపి వేదికగా జీ20 దేశాల కల్చరల్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలు జరుగుతున్నాయి. ఆదివారం ప్రారంభమైన ఈ సమ్మిట్ జులై 12 వరకు కొనసాగ నున్నాయి. G20 సభ్య దేశాలు , అతిథి దేశాలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా సోమవారం జరిగిన సమావేశంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. 'సంస్కృతి మన గుర్తింపులో ఒక భాగం మాత్రమే కాదు. స్థిరమైన అభివృద్ధికి సూచిక. దీనిని భవిష్యత్ తరాలకు అందజేసేందుకు మనమంతా కృషి చేయాలి. ఇందుకోసం మేం నాలుగు ప్రాధాన్యతలను గుర్తించాం. 1. సాంస్కృతిక ఆస్తుల రక్షణ, పునరుద్ధరణ, 2. స్థిరమైన భవిష్యత్తు కోసం సాంస్కృతిక వారసత్వాన్ని ఉపయోగించడం, 3. సాంస్కృతిక, సృజనాత్మక పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం, 4. సంస్కృతి రక్షణ, ప్రమోషన్ కోసం డిజిటల్ టెక్నాలజీలను ఉపయోగించడం' అని ప్రహ్లాదక్ష జోషి చెప్పుకొచ్చారు. ఈ నాలుగు కార్యక్రమాలు సాంస్కృతికంగా విభిన్నమైనప్పటికీ ఏకీకృత ప్రపంచానికి దోహదం చేస్తాయని, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందజేయవచ్చని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

33 ఏళ్ల లవర్‌కు ... రూ.900 కోట్ల ఆస్తి ...
ఇటలీ మాజీ ప్రధాని బెర్లుస్కోని

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 10: ఇటలీ మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోని గత నెలలో కన్నుమూసిన సంగతి తెలిసిందే. 86 ఏళ్ల బెర్లుస్కోనీ లుకేమియాతో బాధపడుతూ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కు గురై ప్రాణాలు విడిచారు. అయితే, బెర్లుస్కోనికి సంబంధించి ఇప్పుడొక ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. బెర్లుస్కోని గత కొంతకాలంగా మార్తా ఫాసినా అనే 33 ఏళ్ల అతివతో ప్రేమాయణం సాగిస్తున్నారు. ఇద్దరి మధ్య 53 ఏళ్ల వయోభేదం ఉన్నప్పటికీ, బెర్లుస్కోని అదేమీ పట్టించుకోలేదు. అంతేకాదు, తన మనసు దోచిన ఫాసినా పేరిట ఆయన రూ.900 కోట్ల ఆస్తిని రాశారని, ఆ మేరకు వీలునామాలో పేర్కొన్నారంటూ ప్రఖ్యాత మీడియా సంస్థ బ్లూంబెర్గ్ వెల్లడించింది. ఇటలీ కుబేరుల్లో ఒకరైన బెర్లుస్కోని మొత్తం సంపద విలువ రూ.4.6 లక్షల కోట్లు కాగా, అందులో రూ.900 కోట్లు పెద్ద విషయమేమీ కాకపోయినప్పటికీ, మాజీ ప్రధానితో డేటింగ్ కారణంగా ఫాసినాకు ఇది ఊహించని బొనాంజా. అన్నట్టు, మార్తా ఫాసినా కూడా రాజకీయ నాయకురాలే. ఇటలీ చాంబర్ ఆఫ్ డిప్యూటీస్ లో ఆమె 2018 నుంచి సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

మర్మాంగం కోసుకొని....
మెడికల్ విద్యార్థి ఆత్మహత్య.

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 10: హైదరాబాద్‌లో దారుణ సంఘటన జరిగింది. దీక్షిత్ (21) అనే ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్య సంఘటన కలకలం రేపింది. ఈ సంఘటన హైదరాబాద్ శివారు ప్రాంతమైన పాపిరెడ్డి నగర్‌లో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా దేవరుప్పల గ్రామానికి చెందిన సోమి రెడ్డి, కరుణ దంపతులు 20 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చి పాపిరెడ్డి నగర్‌లో స్థిరపడ్డారు. వీరికి ఒక కుమార్తెతో పాటు, కుమారుడు దీక్షిత్ రెడ్డి ఉన్నారు.దీక్షిత్ రెడ్డి సికింద్రాబాద్ గాంధీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అయితే దీక్షిత్ గత కొన్ని రోజులుగా మానసిక స్థితి బాగాలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలోనే గతంలో ఓసారి నిద్రమాత్రలు తీసుకున్నాడు. ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. ఈ క్రమంలోనే చికిత్స తీసుకుంటున్న దీక్షిత్ గత కొన్ని రోజులుగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడు.ఈ క్రమంలోనే ఆదివారం కుటుంబ సభ్యులు బయటకెళ్లిన సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లిన కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి వచ్చే సమయానికి దీక్షిత్ రెడ్డి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. 108కి ఫోన్ చేయగా వచ్చి చూసిన సిబ్బంది.. దీక్షిత్ మర్మాంగం కోసుకొని మృతి చెందినట్లు గుర్తించారు.

పెళ్లికి వస్తే గిఫ్ట్ కంప్లసరీ....
పెళ్లికూతురి వెరైటీ కండీషన్.. ఎక్కడంటే..

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 10:

పెళ్లిలో జరిగే అనేక సంఘటనల గురించి తరచూ సోషల్ మీడియాలో చాలా వీడియోలు కనిపిస్తుంటాయి. అవన్నీ చూసేందుకు ఆశ్చర్యంగానూ, మరికొన్ని ఫన్నీగానూ ఉంటుంటాయి. అయితే, ఇలాంటి వధువు గురించి మీరు ఇంతకు ముందెన్నడూ వినుండరు. ఇది నిజంగా వింత సంఘటన అనే చెప్పాలి. ఎందుకంటే..సాధారణంగా పెళ్లికి వచ్చే అతిథులు వారి స్థోమతకు తగ్గట్టుగా వధూవరులకు బహుమతులు ఇస్తుంటారు. అయితే పెళ్లికి వస్తే చిన్నచిన్న బహుమతులు తీసుకురావద్దంటూ అతిథులకు కండిషన్ పెట్టింది ఇక్కడో వధువు. అంతేకాదు..వారు తెచ్చిన గిఫ్ట్ కనీసం రూ.4000ల కంటే తక్కువ కాకుండా ఉండాలంటూ రేటు కూడా ఫిక్స్ చేసి చెప్పింది. దీంతో ఈ వార్త కాస్త సోషల్ మీడియలో వైరల్‌గా మారింది.

వధువు తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా షేర్ చేసిన ఈ పోస్ట్ నెట్టింట తెగ హల్‌చల్ చేస్తోంది. సోషల్ మీడియా రెడ్డిట్‌లో రీట్వీట్ చేయటంతో మరింత వైరల్ అవుతోంది. ఇంతకీ వధువు పెట్టిన పోస్ట్‌లో కండీషన్ ఏంటంటే..పెళ్లికి వచ్చే వారికోసం చాలా డబ్బు ఖర్చుపెట్టి ఏర్పాట్లు చేశామని చెప్పింది. అతిథులు, బంధుమిత్రుల కోసం ఓపెన్ బార్‌లో భోజనం ఏర్పాటు చేశామని, అందుకే ఎవరైనా తన పెళ్లికి ఉట్టి చేతుల్తో వస్తే తనకు చాలా బాధగా ఉంటుందని అందులో రాసింది. అందుకే రూ. 4200లకు తగ్గకుండా బహుమతి ఇవ్వాలని ఆహ్వాన పత్రికతో పాటు రాయించింది. అయితే, ఇదంతా బహుమతికి సంబంధించిన విషయం కాదని కూడా చెబుతూనే.. బహుమతి అడగడం కూడా చెడ్డ విషయం కాదని రాసింది.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ పోస్ట్‌పై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. ఇలా బహుమతి కోరే ఆలోచన తప్పు అంటున్నారు చాలా మంది. ప్రేమతో ఇచ్చే బహుమతి వెలకట్టలేనిది అంటూ చాలా మంది చెబుతున్నారు. ఇది నిజంగా అత్యాశ అంటుండగా, వధువు నిర్ణయాన్ని కొందరు సమర్థించారు.

హింసను పెంచడానికి కోర్టును
యూస్ చేసుకుంటారా .. మణిపూర్ అల్లర్లపై సుప్రీం

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూలై 10: మణిపూర్‌లో కొనసాగుతున్న హింసపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. హింసను మరింత పెంచేందుకు తమను (సుప్రీంకోర్టు) వాడుకోవద్దని ధర్మాసనం కోరింది. ప్రభుత్వం చేపట్టిన చర్యల్ని తాము పర్యవేక్షిస్తామని, మరిన్ని చర్యలు అవసరమైతే తగిన ఆదేశాలను జారీ చేస్తామని, అంతేకానీ భద్రతా యంత్రాంగాన్ని తాము నడపలేమని సోమవారం స్పష్టం చేసింది. ఆ రాష్ట్రంలో హింసను కట్టడి చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ మణిపూర్ ప్రభుత్వం ఓ నివేదికను సమర్పించింది. తదుపరి విచారణ మంగళవారం జరుగుతుందని కోర్టు పేర్కొంది. ఈ అంశంపై చాలా సున్నితంగా వ్యవహరించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ పిటిషనర్లను కోరారు.

తప్పుడు సమాచారం ఇస్తే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు. ఇక పిటిషనర్ల తరపున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వకేట్ కొలిన్ గొంజాల్వెస్, మణిపూర్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొందని చెప్పారు. అయితే గట్టి సూచన చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.

ఇంగ్లీష్‌లో దంచేస్తూ ఘరానా మోసం..

ఏకంగా 15 మంది మహిళలను

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 10: టిప్ టాప్‌గా రెడీ అయ్యి.. చక్కగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ ఏకంగా 15 మందిని వలలో వేసుకున్నాడో నిత్య పెళ్లికొడుకు. అనక డబ్బు బంగారంతో ఉడాయించేవాడు. ఇలా పెళ్లిళ్ల పేరుతో మహిళల జీవితాలతో ఆటలాడుకుంటున్న నిందితుడిని మైసూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుడిని బెంగళూరులోని బనశంకరిలో నివాసం ఉంటున్న మహేష్ కేబీ నాయక్ (35)గా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకెళ్తే..మ్యాట్రిమోనియల్ సైట్‌లను ఉపయోగించి మహేష్ మహిళలను వలలో వేసుకునేవాడు. తనని తాను ఇంజనీర్‌గా, డాక్టర్‌గా పరిచయం చేసుకునేవాడు. తుమకూరులో ఏర్పాటు చేసిన నకిలీ క్లినిక్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నట్లు నమ్మబలికేవాడు. అంతేకాకుండా దారాళంగా మాట్లాడే అతని ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్ స్కిల్స్ విని పలువురు మహిళలు సులువుగా మోసపోయారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన హేమలత (30) అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్ వ్యవహారం వెలుగు చూసింది.బాధితురాలు హేమలత మైసూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. అతని మాయమాటలు నమ్మిన హేమలతతో 2023 జనవరిలో మహేష్ వివాహం జరిగింది. అనంతరం క్లినిక్ ఏర్పాటు చేయాలని డబ్బు కోసం ఆమెను వేధించసాగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమె నగలు, నగదు తీసుకుని పరారయ్యాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు బయటికి వచ్చాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు 2014 నుంచి ఇప్పటి వరకు పెళ్లి పేరుతో మహేష్ ఏకంగా 15 మంది మహిళలను మోసం చేశాడు. అతను వివాహం చేసుకున్న వారిలో చాలా మంది మహిళలు బాగా చదువుకున్నవారు కావడం మరో విశేషం. మోసపోయామని గ్రహించినప్పటికీ పరువుపోతుందనే భయంతో వారిలో చాలా మంది మహిళలు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

మరో క్రేజీ ఆఫర్ కొట్టేసిన ఊర్వశి..

ఆ స్టార్ హీరో సినిమాలో స్పెషల్ సాంగ్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10: ఊర్వశి రౌతేల.. ప్రస్తుతం టాలీవుడలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. బాలీవుడ్‌లో బిజీ యాక్టర్ గా గడుపుతున్న ఈ బ్యూటీ సౌత్‌లో స్పెషల్ సాంగ్స్ చేస్తోంది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ చేసింది. బాస్ పార్టీ అనే పాటలో అదరగొట్టింది. ఆ తర్వాత అక్కినేని అఖిల్ ఏజెంట్ సినిమాలో కూడా స్పెషల్ సాంగ్ చేసింది. సినిమా హిట్ కాకపోవడంతో అంతగా ఈ పాట పాపులర్ కాలేదు. ఇక ఇప్పుడు ఊహించని విధంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ , సాయి ధరమ్ తేజ్ కలిసి నటిస్తున్న బ్రో సినిమాలో మెరిసింది. రీసెంట్ గా రిలీజ్ అయిన బ్రో మూవీ మైడియర్ మార్కిండేయ సాంగ్ లో కనిపించింది. ఈ చిన్నది తన అందంతో మరోసారి ఆకట్టుకుంది ఈ బ్యూటీ.



కడుపులో బేబీ తంతోంది... పోస్ట్ షేర్ చేసిన ఇలియానా

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10:

సినిమాలకు దూరంగా ఉంటున్నా ఇలియానా పేరు మాత్రం వైరల్ అవుతూనే ఉంటుంది. హీరోయిన్ గా కంటే ఇప్పుడు ఈ అమ్మడు ఎక్కువ పాపులర్ అవుతుంది. హీరోయిన్ గా ఇలియానా ఒకానొక టైం లో టాలీవుడ్ లో రాణించింది. తెలుగులో దేవదాసు సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ తక్కువ సమయంలోనే భారీ ఆఫర్స్ ను అందుకుంది. అలాగే మహేష్ బాబు నటించిన బిగెస్ట్ బ్లాక్ బస్టర్ పోకిరి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆతర్వాత వరుస ఆఫర్స్ తో దూసుకుపోయింది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ ఈ చిన్నది సినిమాలు చేసి హిట్స్ అందుకుంది. దళపతి విజయ్ లాంటి స్టార్ హీరోల సినిమాల్లో నటించింది. అదేవిధంగా బాలీవుడ్ లోనూ పలు సినిమాలు చేసింది. బాలీవుడ్ లో ఆఫర్స్ రావడంతో సౌత్ ను లైట్ తీసుకుంది.

ఇదిలా ఉంటే ఇప్పుడు తిరిగి సన్నజాజిలా మారి అవకాశలకోసం ఎదురు చూస్తుంది. కానీ అంతలోనే నేను గర్భవతిని అని షాక్ ఇచ్చింది. బేబీ బంప్ తో ఫోటోలు పెడుతూ సోషల్ మీడియాలో సెన్సేషన్ గా మారింది. దాంతో ఆమె అభిమానులంతా ఇలియానా బాయ్ ఫ్రెండ్ ఎవరా.? అని కనిపెట్టే పనిలో ఉన్నారు.

నాలుగేండ్లు ఆ మాటే మరిచిపోయా.. అందుకే అలా ఫిక్సయ్యానంటున్న రకుల్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10: టాలీవుడ్ టు బాలీవుడ్ తళతళ మెరుస్తున్న తారక రకుల్ ప్రీత్ సింగ్. షూటింగ్ కోసం తరచూ విదేశాలకు వెళ్లడం తప్ప, ప్రత్యేకించి విహారానికి బయల్దేరడం తక్కువే అంటున్నదీ ముద్దుగుమ్మ. వెకేషన్‌కువెళ్తే మాత్రం.. బోలెడంత ఎంజాయ్ చేస్తుందట. కడలిని తలుచుకోగానే బడలిక తీరుందటూ ఈ అమ్మడు తాజాగా పోస్ట్ చేసింది.

చూసి మురవాలె.....

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10: లవ్ ఫెయిల్యూర్ మూవీతో తెలుగు తెరపై మెరిసిన తమిళ బ్యూటీ ఐశ్వర్య మీనన్.. ఇప్పుడు ఫుల్ జోష్ లో ఉంది ఈ ముద్దుగుమ్మ. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ సొగసరి ఫాలోయింగ్ బాగా సంపాదించింది. తన అందం , అభినయంతో అభిమానులను సొంతం చేసుకుంది. లేటెస్ట్ ఫొటోస్ చూస్తే మీరు ఈ వయ్యారి సొగసుకి పడిపోవాల్సిందే..

లేలేత అందాలతో.... హాట్ బ్యూటీ "ఐశ్వర్య మీనన్" ఫొటోస్...

వాలంటీర్లపై పవన్ కల్యాణ్ సంచలన ఆరోపణలు..

క్రిమినల్ కేసు పెట్టాలంటోన్న ఆర్జీవీ

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10:
వారాహి రెండో విడత యాత్రలో భాగంగా ఆదివారం జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఏపీ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా అక్కడి వాలంటీర్లపై పవన్ చేసిన ఆరోపణలు హాట్ టాపిక్‌గా మారాయి. వాలంటీర్లు ప్రతి గ్రామంలో ఎవరు ఎవరి మనిషి? ఏ ఫ్యామిలీలో ఎంతమంది ఉన్నారు? అమ్మాయిలు ఎవరినైనా ప్రేమిస్తున్నారా లేదా? వితంతువులున్నారా లేదా అనే వివరాల్ని సేకరించి సంఘ విద్రోహ శక్తులకు చేరవేస్తున్నారని జనసేన అధ్యక్షులు ఆరోపించారు. అంతేక కాకుండా వాళ్లను ట్రాప్ చేసి హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారంటూ సంచలన ఆరోపణలు చేశారు.

ఇప్పుడీ వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఇక గత కొన్ని రోజులుగా పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేస్తోన్న ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందించారు. ప్రజలకు సేవలు చేస్తోన్న

వాలంటీర్లపై నిరాధార ఆరోపణలు చేసిన పవన్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా వరుసగా పోస్టులు షేర్ చేశారు వర్మ.

ఇన్‌స్టాలో పవన్‌ను ఫాలో అవుతున్న

స్టార్ హీరోయిన్లు?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10: పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుపెట్టారు. జులై 4వ తేదీన ఎలుగెత్తు, ఎదురించు, ఎన్నుకో..జైహింద్ అనే బయోతో తన ఇన్‌స్టా ఖాతాను ఓపెన్ చేశారు. అలా ఇన్‌స్టా అకౌంట్‌ను ఓపెన్ చేశారో లేదా ఫాలోవర్లు పోటెత్తారు. దెబ్బకు ఇన్‌స్టా మొత్తం షేక్ అయ్యింది. ఫాలోవర్ల విషయంలో రికార్డులు బద్ధలయ్యాయి. ఇప్పటివరకు (జులై 10 మధ్యాహ్నం) వరకు పవన్ అనుసరిస్తున్న వారి సంఖ్య 2.3 మిలియన్లకు చేరింది. అది కూడా ఒక్క పోస్ట్ పెట్టకుండానే. మరోవైపు పవన్ ఇన్‌స్టాలో మొదటగా ఏం పోస్ట్ చేస్తారోనని ఫాలోవర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒకవేళ మొదటి పోస్ట్ పెడితే మాత్రం పవన్‌కు మరింత మంది ఫాలోవర్స్ పెరిగే అవకాశం ఉంది. కాగా సినిమా ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు ఇన్‌స్టాలో పవన్‌ను ఫాలో అవుతున్నారు. ఇందులో స్టార్ హీరోయిన్లు కూడా ఉన్నారు. శ్రుతిహాసన్, కీర్తి సురేష్ తదితర అందాల తారలు పవన్‌ను అనుసరిస్తున్నారు.ప్రస్తుతం వారాహి యాత్రలో బిజీగా ఉంటున్నారు పవన్ కల్యాణ్. ఇక సినిమాల విషయానికొస్తే.. పవన్ నటించిన బ్రో చిత్రం జులై 28న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. సముద్ర ఖని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీలో మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ మరో హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజైన పవన్, సాయిల ఫస్ట్‌లుక్స్, టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ఇక ఇటీవలే

ఇకలొల్లే .. లొల్లి ... త్వరలోనే సిల్వర్ స్క్రీన్‌పైకి

మంత్రి మల్లన్న.?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10: పూలమ్మిన, పాలమ్మిన, కష్టపడ్డ.. ఈ ఒక్క డైలాగ్ చాలు మంత్రి మల్లారెడ్డి క్రేజ్ ఏంటో తెలుసుకోవడానికి. రాజకీయ నాయకుడిగా, మంత్రిగా కంటే ఆయనే ప్రసంగాలతోనే ఎక్కువ ఫేమస్ అయ్యారు. ఇప్పుడు అదే మంత్రి మల్లారెడ్డి 'మల్లారెడ్డి ఎంటర్టైన్మెంట్స్' తో మన ముందుకు రాబోతున్నారు. అంటే ఇక సందడే సందడే అన్నమాట..ఆయన ఏది మాట్లాడినా యూట్యూబ్లో సంచలనమే.. మిలియన్ల వ్యూస్. అసెంబ్లీలోనూ ఆయన స్పీచ్ అంటే నవ్వుల పంట. కెసిఆర్, కేటీఆర్ కూడా అసెంబ్లీలో పడి పడి నవ్వుతూ ఉంటారు. పొలిటిషినే కాదు మల్లారెడ్డి మంచి ఎంటర్టైనర్ కూడా. యూత్ లో మంచి ఫాలోయింగ్ కూడా ఉంది ఆయనకు.. ఇదంతా ఒక ఎత్తైతే ఈమధ్య సినిమాలపై దృష్టి పెట్టారట మంత్రి మల్లారెడ్డి. మల్లారెడ్డి ఎంటర్టైన్మెంట్స్ పేరుతో ఓ సంస్థను స్థాపించబోతున్నారు. ఇప్పటికే ఇద్దరు ముగ్గురు దర్శకులతో చర్చలు కూడా అయిపోయాయి. త్వరలో మల్లారెడ్డి సినీ రంగంలో నిర్మాతగా కూడా మారబోతున్నారని సమాచారం.

అంతేకాదు అతి త్వరలో ఎంటర్టైన్మెంట్ టీవీ ఛానల్ తో పాటు ఒక ఓటీపీ ప్లాట్ఫారం కూడా ప్రారంభించబోతున్నారట. మల్లారెడ్డి కోడలు ఈ వ్యవహారాలన్నీ దగ్గరుండి చూసుకుంటున్నారని సన్నిహితులు చెబుతున్నారు.ఇందుకోసమే ఈ మధ్య వరుసగా సినిమా ఫంక్షన్లకి మల్లారెడ్డి గెస్ట్ గా వెళ్తున్నారు. ఆయన వెళ్లడమేమో గాని చిన్న చిన్న సినిమాలకు కూడా పెద్ద ప్రమోషన్ లభిస్తుంది. మల్లారెడ్డి నిర్మాత గానే నా సినిమాల్లో కూడా నటిస్తారా ? సోషల్ మీడియాలో ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

హంస హొయలు..

పోరగాళ్ల మతిపోగొడుతున్న 'మౌనీ రాయ్'..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10: సీరియల్‌తో బుల్లితెరపై ఎంట్రీ ఇచ్చి ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ పై తనదైన స్టైల్ , యాక్టింగ్‌తో దుమ్మురేపుతుంది. వరస అవకాశాలతో ఫుల్ జోష్‌లో ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియాలోనూ అదే ట్రెండ్ క్రీటే చేస్తుంది. హాట్ హాట్ ఫొటోస్

అప్పుడే మొదలైన బ్రో మేనియా..

హైప్‌తో ఊగిపోతున్న ఫ్యాన్స్...

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 10: బ్రో సినిమా వైబ్స్ మామూలుగా లేవు జనాల్లో. ఆల్రెడీ రిలీజ్ డేట్‌కి కౌంట్ డౌన్‌స్టార్ట్ అయింది. మై డియర్ మార్కండేయ అంటూ మోత మోగిస్తున్నారు జనాలు. గెట్ రెడీ టు పంప్ అప్ ద వాల్యూమ్ అని మేకర్స్ పిలుపిస్తే, మీరు రిలీజ్ చేయడమే ఆలస్యం, మేం అందుకున్నాం చూడండి అంటూ కాన్ఫిడెన్స్ రేషియో పెంచేశారు ఫ్యాన్స్. బ్రో మేనియా ఆ రేంజ్‌లో ఉంది. పవర్‌స్టార్, ఆయన మేనల్లుడు కలిసి చేయబోయే మేజిక్ కోసం ఫ్యాన్స్ పడిగాపులు కాస్తున్నారు. సినిమా బాగా వచ్చిందనే ఇన్‌సైడ్ టాక్ వాళ్లల్లో ఉత్సాహాన్ని ఇంకా ఇంకా పెంచుతోంది. ఇదే జోరుతో పవన్ కల్యాణ్ ఓజీ మీద కూడా ఆశలు పెంచేసుకుంటున్నారు. దానికి తగ్గట్టే ఓజీని సూపర్ స్పీడ్‌తో డ్రైవ్ చేస్తున్నారు కెప్టెన్ సుజీత్. ఓజీ ఎలాగూ కంప్లీట్ అవుతుంది. సెట్స్ మీదుంది ఉస్తాద్ భగత్‌సింగ్. మాసివ్ షెడ్యూల్ చేస్తున్నామంటూ ఇటీవల మేకర్స్ అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. త్వరలోనే వారాహి యాత్ర మళ్లీ మొదలవుతుంది. ఈ షెడ్యూల్‌తో భగత్‌సింగ్ షూట్ ఎంత పూర్తవుతుంది? ఇంకెంత బ్యాలన్స్ ఉంటుందని ఆరా తీస్తున్నారు ఫ్యాన్స్.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838